ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 సంచిక : 8 ఏప్రిల్ 2007

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు............ 09-03-07
చించినాడ......... 11-03-07
పాలమూరు....... 05-02-07
చించినాడ......... 16-02-07

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-2007, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

యోగా అంటే కొన్ని ఎక్సర్‌సైజులు చెపుతారు, మీరు రోజూ ఉదయం నడుస్తూ ఉంటారు. ఇవి అన్నీ శరీరానికి మంచిదే, మనస్సును నిగ్రహించుకోవటానికి ప్రాణాయామం కొంతవరకు సహకరిస్తుంది. ప్రాణాయామం చేస్తూ ఉంటే మనస్సు మనలను బాధపెట్టకుండా పది నిమిషాలు ఆగుతుంది. ఇవి అన్నీ యోగా క్లాసులలో నేర్పుతున్నారు. కాని భగవంతుడు చెప్పిన యోగం అంటే భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి మనస్సును సమాయత్తం చేయటం. మనస్సును భగవంతుడిలో ఐక్యం చేయటానికి మీరు చేసే ప్రతీ పని కూడా యోగమే. పరీక్షలు వచ్చినప్పుడు చదువుకొనే పిల్లలు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారో అలాగ భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి మన మనస్సును మనం ప్రిపేర్ చేయాలి. మన మనస్సును మనం సంస్కరించుకోవటమే యోగం, మనస్సును నియమించుకోవటమే యోగం. ఎంతవరకు మనస్సును నియమించుకోవాలి అంటే నది వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ ఈ మనస్సు వెళ్ళి భగవంతుడిలో ఐక్యం అవ్వాలి. మీలో ఇద్దరి మనస్సులు ఒకేలాగ ఉన్నాయి అనుకోండి, స్నేహంగా ఉంటారు. మనస్సులు ఒకలాగ ఉండకపోతే వారు ఎడమొఖం, పెడమొఖం కింద ఉంటారు. భగవంతుడి యొక్క మనస్సు ఎంత పవిత్రంగా ఉంటుందో, ఎంత విశాలంగా ఉంటుందో అలాగ ఆ స్థాయిని మన మనస్సు చేరితే అప్పుడు అది భగవంతుడిలో ఐక్యమవుతుంది, అది కడసారి జన్మ. బహుజన్మల కృషి వలన కాని మీరు భగవంతుడిలో ఐక్యం కాలేరు అని పరమాత్మ

చెప్పాడు. అసలు మనం సాధన ఏమీ చేయటం లేదు. అది కావాలి, ఇది కావాలి అని కోరికలతోనే సరిపోతోంది. ప్రాపంచిక మనుషుల గొడవ వదిలి వేయండి, అసలు భక్తులు చెయ్యవలసిన మొదటి పని, రెండవ పని, చివరి పని కూడా మనస్సును బాగుచేసుకోవటమే, అదే ముఖ్యమైన పని అని భక్తులకు అర్థమవ్వటం లేదు. ఆహారం పట్ల నియమం ఉండాలి. ఆహారం తినేటప్పుడు ఇది సరిపోతుంది అని శరీరం చెపుతుంది, అప్పుడు మనం మానెయ్యాలి. అన్నం తినేటప్పుడు ప్రక్కవారితో మాట్లాడకుండా మౌనంగా తినాలి. భగవంతుడిని స్మరించు కొంటూ తింటే అది ప్రసాదమవుతుంది. మనం తినే ఆహారమే మనస్సు కింద తయారవుతుంది, అందుచేత ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నియమములన్నింటిలో ఆహారనియమం ఉత్తమమైనది అని రమణమహర్షిగారు చెప్పారు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే శరీరం, మనస్సు అదుపులోనికి వస్తాయి, సాధన చెయ్యటానికి సహకరిస్తాయి. అనారోగ్యం వచ్చినప్పుడు ఆరోగ్యం చేకూర్చుకోవటానికి అందరూ ప్రయత్నం చేస్తారు. మన శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యసూత్రాలను పాటిస్తే అనారోగ్యం రాదు, ఆరోగ్యం అలా కంటిన్యూ అవుతుంది. మనకు భగవదనుభవం కలగటానికి వారు అడ్డు, వీరు అడ్డు అనుకొంటాము కాని మన మనస్సే మనకు అడ్డువస్తోందని మనకు తెలియటం లేదు.

మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా బాగుపడాలంటే ఎవరోవచ్చి ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండకండి. మీ బాగుకోసం మీరు కృషి చేసుకోండి, మీరు కృషిచేస్తూ ఉంటే భగవంతుడి సహాయం వస్తుంది, గురువు సహాయం వస్తుంది. మన మనస్సు మీద ఉన్న నమ్మకం భగవంతుడి మీద లేదు. మనకు పని గురించి అసలు సంకల్పం రాలేదు అనుకోండి, ఆ పని అవ్వదేమో అనుకొంటాము. మన సంకల్పంతో సంబంధం లేకుండా భగవంతుడు సంకల్పిస్తే ఆ పని పూర్తి అయిపోతుంది. భగవంతుడి సంకల్పం లేకుండా మనం కాళ్ళు కదపలేము, చేతులు కదపలేము, అంతా భగవంతుడే. మరణించేటైములో నీవు ఏది స్మరిస్తే అది అవుతావు, నీకు ఏవిధమైన తలంపులు వస్తే దానినిబట్టి పునర్జన్మ వస్తుంది. ఇప్పటినుండి ప్రయత్నం చేస్తేగాని శరీరం మరణించేటప్పుడు మనకు మంచిఆలోచనలు రావు, భగవంతుడిని స్మరించలేము. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. ఇప్పటినుండి ప్రిపేర్ అయితే ప్రాణం దేహాన్ని విడిచిపెట్టే టైము వచ్చేటప్పటికి మనకు మంచిఆలోచనలు, మంచితలంపులు వస్తాయి. భగవంతుడు మన మనస్సులో నిలబడి ఉంటాడు. ప్రాణం మన శరీరాన్ని విడిచిపెట్టక ముందే మనం ఆనందస్థితిని, శాంతిస్థితిని పొందగలిగితే ఇంక మనం శవాలను మోయనక్కరలేదు, పునర్జన్మ లేదు. యజ్ఞభావనతో పనిచెయ్యమని భగవంతుడు చెప్పాడు.

మన మనస్సును పవిత్రం చేయటానికే యజ్ఞాలన్నీ పరమాత్మ చెప్పాడు. దేవయజ్ఞం అంటే దేవతలను పూజించటం, వారికి నమస్కరించటం వలన వారి ఋణం తీరిపోతుంది. మనుష్యయజ్ఞం అంటే నువ్వు సుఖంగా ఉండు, ఇతరులు సుఖంగా జీవించటానికి సహాయం అందించండి. అది మనుష్యయజ్ఞం. మీమీద ఆధారపడి జంతువులు ఉంటాయి. మిమ్మల్ని మీరు ఎలా చూసుకొంటున్నారో జంతువులను కూడా అలా ప్రేమగా చూసుకోవాలి, దానిని భూతయజ్ఞం అంటారు. ఋషియజ్ఞం చాలా ముఖ్యం. మీకు ఇంటి దగ్గర పనులు అయిపోయిన తరువాత ఖాళీగా ఉన్నప్పుడు రామకృష్ణ పరమహంస చెప్పిన మాటలుగాని, భగవాన్ చెప్పిన మాటలుగాని, భగవద్గీతగాని, మీకు నచ్చిన శాస్త్రం ఏదో ఒకటి అధ్యయనం చేసుకోవాలి. అది ఋషియజ్ఞం.

ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అంటారు అనుకోండి. చెడ్డవారి మీద ద్వేషం పెరుగుతుంది, మంచి వారి మీద ఇష్టం పెరుగుతుంది, అది పాపానికి దారి తీస్తుంది. చెడ్డ వారిమీద ద్వేషం పెట్టుకోవద్దు, పోనీ వారితో స్నేహం చేయటం మానివేయవచ్చు. వాడు చెడ్డవాడు, వాడు చెడ్డవాడు అని అనుకొంటే వాడికంటే నువ్వు ఎక్కువ చెడ్డవాడవు అయిపోతావు. మీలో చెడ్డ లేదు అనుకోండి వారిలో చెడ్డ కనబడదు, మీలో ఉన్న చెడ్డే, మీలో ఉన్న అశాంతే బయట కనిపిస్తోంది. నీ మనస్సులో ఉన్నదే బయట కనిపిస్తుంది కాని నీ మనస్సులో లేనిది బయట కనబడదు. మంచి, చెడ్డ, సుఖం, దుఃఖం అంతా మనస్సులో ఉంది, మనస్సు అనే గడప దాటితే ఏమీ లేదు, ఉన్నది అంతా మహావెలుగు, మహాశాంతి, మహాఆనందం. సుఖం, శాంతి అనేవి బయట లేవు, నీ హృదయంలో ఉన్నాయి. మన హృదయంలో ఉన్న సుఖం, శాంతి, ఆనందం మనకు దొరికేవరకు జననమరణ ప్రవాహంలో తిరుగుతూ ఉండవలసిందే, చనిపోతూ పుడుతూ ఉండవలసిందే. ఏ మనిషికి దేవుడు అక్కరలేదు, సుఖం కావాలి, శాంతి కావాలి. మీరు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారు అనుకోండి, శాంతిగా ఉన్నారు అనుకోండి మీకు దేవుడు తాలుక తలంపు అసలు రాదు. మీకు అశాంతిగా ఉన్నప్పడే దేవుడు జ్ఞాపకం వస్తాడు. మేము చాలా గ్రేట్ అని కొంతమంది అనుకొంటారు. చైతన్యానికి ఎక్కువ, తక్కువ ఏమిటి? దానికి ద్వితీయం లేదు. ఈ గొప్పలు అన్నీ మనస్సుకే, ఇవి అన్నీ మనస్సు కల్పించిన విషయాలు. మనస్సు కల్పించిన విషయాలలో పడిపోయి, ఇలా వేలాది జన్మలు కొట్టుకొని పోతున్నాము. మనం ఏమి చెయ్యాలి అంటే మన మాట, చేత, ఆలోచన ఇవి అన్నీ మన మనస్సును బాగుచేస్తున్నాయా, లేదా అని మనం లోపల చూసుకొంటూ ఉండాలి. జన్మాంతర అనుబంధాన్ని బట్టి ఒకో వాసన ఒకో మనిషిని పీడించేస్తుంది. ఆవాసన యొక్క పీడ ఎలా

వదులుతుంది అంటే దానిని తొలగించుకోవటానికి నీవు ఎంతోకొంత ప్రయత్నం చేస్తూ ఉంటే, గురువును ప్రార్థిస్తూ ఉంటే, ఈశ్వరుడిని ప్రార్థిస్తూ ఉంటే ఆ వాసన నెమ్మదిగా పల్చబడి రాలిపోతుంది. ఏ అలవాటు అయితే మనిషిని పీడించేస్తోందో అదే నిజం అని వాడికి అనిపిస్తుంది, అది ఇంకపోదేమో అని వాడికి అనిపిస్తుంది, కాని ప్రయత్నం చేస్తే పోతుంది. దానికి నీ ప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువుఅనుగ్రహం ఉండాలి. విధి బలీయమైనది. విధి ఒకోసారి ఎలా చేస్తుంది అంటే ధర్మరాజు మనకంటే వెయ్యి రెట్లు గొప్పవాడు అందులో సందేహం లేదు. జూదం ఒక వ్యసనం, అది అలవాటు అయిపోయింది. ఒకసారి జూదంలో నష్టపోయాడు. ధర్మరాజును మాయ చెయ్యటానికి, మరల జూదం ఆడదామని కబురు పంపించారు. ఇందులో మాయ ఏదో ఉంది, మన రాజ్యం పోతుంది అని ఎంతో కొంత ధర్మరాజుకు తెలుసు, కాని జూదం అనే బలహీనత ఆయనను తీసుకొని వెళ్ళింది, మరల ఓడిపోయాడు. జూదం ఆడినంతమాత్రాన ధర్మరాజు చెడ్డవాడు అని కాదు, ఆయన మంచివాడే కాని విధి బలీయమైనది, తీసుకొని వచ్చి జూదం ఆడించింది, జూదంలో ఓడిపోవటం, అరణ్య వాసానికి వెళ్ళటం, తరువాత కౌరవ పాండవ యుద్ధం జరగటం, కౌరవులు నశించటం, మరల ధర్మరాజు పరిపాలన చేయటం ఇదంతా విధి అలా నడిపించింది. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా దానిని ప్రోపర్‌గా అర్థం చేసుకోవటం కష్టం, విమర్శించటం చాలా తేలిక. మనకు సరిగా అర్థం చేసుకొనే బుద్ధి ఉండాలి. అన్ని మంత్రాలలోకి గాయత్రి మంత్రం గొప్పది. మంచి మార్గంలో నడవాలంటే నాబుద్ధి బాగుపడాలి, అటువంటి మంచిబుద్ధిని నాకు ఇచ్చి మంచిమార్గంలో నడిపించమని గాయత్రి మంత్రం అర్థం. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వాటిలో పడకుండా నన్ను రక్షించి, నేను ఏరకంగా జీవిస్తే భగవంతుడిలో ఐక్యమవుతానో అటువంటి బుద్ధిని ప్రసాదించమని గాయత్రి మంత్రం అర్థం.

మన బుద్ధి మంచిది కాదు అనుకోండి, మనకు బుద్ధిసూక్ష్మత లేదు అనుకోండి మీరు భగవద్గీత ఎన్నిసార్లు చదివినా అది మీకు అర్థంకాదు, శాస్త్రం తన హృదయాన్ని మీకు ఇవ్వదు. కృష్ణుడు ఏ చైతన్యస్థాయిలో భగవద్గీత చెప్పాడో ఆ స్థాయి మనకు వచ్చినప్పుడే గీత మనకు అర్థమవుతుంది అంతేగాని మన పాడుబుద్ధికి గీత అర్థం కాదు. అయ్యో మనకు గీత అర్థం కావటం లేదు, దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి అని మనం అనుకోవటం లేదు, గీతలో పొరపాట్లు ఉన్నాయి అనుకొంటున్నాము. మనకు బాహ్యంగా ఏది ఉన్నా స్వప్నంతో సమానము. మన మనస్సు ఎంత నిజమో బాహ్యంగా జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. మనకు గౌరవం ఉంది అనుకోండి, గౌరవం ద్వారా మన మనస్సు

బాగుపడాలి. గౌరవం ద్వారా మనస్సు బాగుపడకపోతే గౌరవం ఏమి చేసుకొంటాము. మనస్సుకు లోచూపు కలగకుండా ఆత్మజ్ఞానం రాదు. మన మాటద్వారా, చేతద్వారా మనస్సుకు లోచూపు కలగాలి, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయాలి, ఆ రకంగా ప్రయత్నం చేయటమే సాధన. ముందు మనం శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి, దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అర్థమైతే ఆచరించాలి అనే బుద్ధి కలుగుతుంది, ఆచరించిన తరువాత అనుభవంలోనికి వస్తుంది. భగవంతుడు తప్పించి అన్నీ అసత్యమే. చదువు, డబ్బు, గౌరవం ఇవి అన్నీ మనో దేహములు ఎంత నిజమో అవికూడా అంతే నిజం, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి అవి వస్తాయి. నీ సంకల్పంతో సంబంధం లేకుండా దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వచ్చేస్తుంది. ఎవరి దేహం ద్వారా ఏపని చేయించాలో భగవంతుడు చూసుకొంటాడు, అది అలా జరిగిపోతూ ఉంటుంది, ఆ పని నుండి మనం తప్పించుకోవాలి అని చూసినా అది ఆగదు. నీ దేహం ద్వారా ఏ పని అయితే జరుగుతోందో దానిని అయిష్టంగా చెయ్యవద్దు, ఇష్టంతో చెయ్యి, అది కూడా సాధనే. దేవుడి ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకొంటే అప్పుడు రెండు లాభాలు పాత వాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు. వ్యర్థమైన మాటలు మాట్లాడటం, వ్యర్థమైన పనులు చేయటం, వ్యర్థమైన తలంపులు, వ్యర్థమైన ఆలోచనలతో కాలక్షేపం చేస్తూ జనం చనిపోతున్నారు. మీ ఇంటికి చుట్టాలు వస్తే మీ ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాచి ఇవ్వటం ఎలా ఉంటుందో వ్యర్థమైన ఆలోచనలతో, పనులతో మీ జీవితం గడపటం కూడా అలాగే ఉంటుంది అని చెపుతున్నారు.

రూపచింతన, నామచింతన తగ్గించుకోండి. రూపనామములే మనలను బంధిస్తున్నాయి. దేహప్రారబ్ధంలో ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది, ఏది జరిగినా అది అబద్ధమే. నీదేహం ఎంతనిజమో, మనస్సు ఎంత నిజమో జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. సత్యసాక్షాత్కారం కోసం ప్రయత్నం చేయటం మానేసి గతించిన గొడవలు తలపెట్టుకోవటం వలన కాలము, శక్తి వృధా అవుతాయి, ఈలోపు ఏదో రోజు మరణం వస్తుంది చనిపోతావు. నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. నీకు దేహభావన ఉండటం వలన, బయట దేహంతో ఉన్న గురువు అవసరం అవుతున్నాడు. గురువు అంటే ఆత్మే, ఈశ్వరుడే. గురువుకు దేహం ఉంటుంది కాని దేహంతో తాదాత్మ్యం ఉండదు, తాను దేహమాత్రుడను కాదు అని ఆయనకు తెలుసు. మనకోసం వేషం వేసుకొని వచ్చిన దేహం అది. తనువు తాను కాదని తెలిసిన వాడికి జపమేల, తపమేల, ధ్యానమేల ఓరామా! శ్రీరామ అంటాడు త్యాగరాజు. మీరు ఇంటి దగ్గర రోజూ ఎక్కౌంట్లు ఎలాగ చూసుకొంటున్నారో అలాగ మీరు ఎంతవరకు వైజర్ అండ్ ప్యూరర్ అయ్యారో ఏరోజుకారోజు చూసుకోండి. ఎంతవరకు

బుద్ధిసూక్ష్మత పెరుగుతోంది, ఎంత వరకు పవిత్రులం అయ్యాము అని ఏరోజుకారోజు చూసుకోవాలి. రోగం వచ్చిన తరువాత బాగుచేసుకోవటం కంటే రోగం రాకుండా చూసుకోవాలి. అలాగే మనస్సుకు చాపల్యం వచ్చిన తరువాత నిగ్రహించుకోవటం కాదు, అసలు మనస్సుకు ఎందుకు చాపల్యం వస్తోంది అని చూసుకొని ఆ కారణాన్ని తగ్గించుకోండి. రాగద్వేషములు లేకపోతే మీ మనస్సు కదలదు. రాగరహితస్థితి, ద్వేషరహితస్థితి మీరు పొందారు అనుకోండి అసలు మీ మనస్సుకు చాపల్యంతో పనిలేదు. ఈ ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్పించి ఏముంది అన్నాడు గౌతమబుద్ధుడు. ఈ లోకంలో చాలామంది మంచిపనులు చేస్తారు కాని పుణ్యం వస్తుందని చేస్తారు, లేకపోతే ఆపని చెయ్యరు. పుణ్యం ప్రధానం కాదు. మీరు చేసే పని ద్వారా అసలు మీ మనస్సు బాగుపడుతోందా, మీ మనస్సు పవిత్రం అవుతోందా లేదా అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. మన శరీరం ఏదోరోజు చనిపోతుంది. అప్పుడు నూటికి నూరు పాళ్ళు మనస్సులో క్షోభ ఉండకూడదు. మనస్సులో క్షోభ మిగిలిపోతే పునర్జన్మ వచ్చేస్తుంది.

మన జీవితాలు అన్నీ తీసేసిన సినిమాలు వంటివి. ఈ శరీరం ఏ పని నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చిందో ఆ పని పూర్తి అయ్యాక శరీరం చనిపోతుంది. ఈలోపు ఈ శరీరం ద్వారా జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది, నువ్వు దానితో తాదాత్మ్యం పొందవద్దు. దానితో తాదాత్మ్యం నీకు లేనప్పుడు బాహ్యవిషయాల ద్వారా ఏదైనా సంతోషం వచ్చినా పొంగిపోవు, దుఃఖం వచ్చినా కృంగిపోవు. మీరు రెండు మూడు గంటలు పూజలు చేసేసి సంతోషం వస్తే పొంగిపోతూ, దుఃఖం వస్తే కృంగిపోతూ ఉంటే మనస్సు బలహీనపడి మనోచాపల్యం పెరిగిపోతుంది. బాహ్యవస్తువులతో తాదాత్మ్యం వలన మనస్సుకు లోచూపు రాదు. లోచూపు కలుగకపోతే ఆత్మజ్ఞానం కలుగదు, ఆత్మశాంతి మనకు అందదు. ఆత్మానుభవం పొందటమే మన జీవిత గమ్యం, అంతవరకు పునర్జన్మలు ఆగవు. మనం ఏదిగా ఉన్నామో ఆ వస్తువు తాలుక అనుభవం మనం పొందాలి, దానితో ఏకం కావాలి. ఆ అనుభవం పొందేవరకు ఈ ప్రయాణాలు తప్పవు. సుఖంకోసం, శాంతికోసం కంగారుపడకండి. ఈ దేహంతో తాదాత్మ్యం తగ్గించుకొంటే మీరు భరించలేనంత సుఖం, శాంతి ఇప్పడే వచ్చేస్తాయి. నువ్వు వేరు, నేను వేరు అనే బేదబుద్ధి మనకు ఉంది, అదే పాపం. ఇంక మనం ఏమి బాగుపడతాము. ఇతరులలో లేని ప్రత్యేకత ఏదో నాలో ఉంది అని మీరు అనుకొంటున్నారు అనుకోండి. లోపల పాపం ఉంది కాబట్టి మీకు అటువంటి తలంపులు వస్తున్నాయి. నీ పాడుబుద్ధి వలన నీకు ఆత్మజ్ఞానం రాదు, బేధబుద్ధి వలన నీకు ఆత్మజ్ఞానం కలుగదు. దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధికి ఆత్మజ్ఞానం రాదు. ఇక్కడ పరమాత్మ

ఏమి చెపుతున్నాడు అంటే నన్ను స్మరించగా స్మరించగా, నీ ఇష్టాయిష్టాలను ఒక ప్రక్కనపెట్టి నాకు ఇష్టమైన పనిని చేస్తూ, ఆ పనిని నాకు అర్పించి పని చేస్తూ ఉంటే, ఆ రకంగా నీవు జీవిస్తూ ఉంటే నీకు ఎటువంటి బుద్ధిని ప్రసాదిస్తే ఆత్మజ్ఞానం కలుగుతుందో అటువంటి బుద్ధిని నేను నీకు ఇస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. నీ తెలివితేటల వలన సంపాదించుకోలేవు, దానికి నీ తెలివి సరిపోదు. మనం మంచి పనులు చేస్తాము కాని భగవంతుడికి అర్పించుకోవటం లేదు, మన అహంకారానికి అర్పించుకొంటున్నాము. కొంతమంది కృత్రిమ గౌరవాలకోసం పనిచేస్తూ జీవితాన్ని పాడు చేసుకొంటారు. మీకు చదువులేదు అనుకోండి, డబ్బు లేదు అనుకోండి. వాటి గొడవ మీకు వద్దు. గురువు మీద ఉన్న ఇష్టం వలన, ప్రేమ వలన, మానసికఅనుభవం వలన మీకు జ్ఞానం వచ్చేస్తుంది, గురువుతో ఉన్న అనుబంధం వలన లోపల ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. ఆ వస్తువు నాకు తెలియబడాలి అని నీవు అనుకొంటే అది తెలియబడదు. అది ఎవరికి తెలియబడాలి అనుకొంటుందో వారికి మాత్రమే తెలియబడుతుంది. వీడు పవిత్రుడు అయ్యాడు, వీడికి బాగా మెచ్యూరిటీ వచ్చింది అని ఆయన అనుకోవాలి, అనుకొంటే అప్పుడు ఆయన తెలియబడతాడు, వాడు ఈశ్వరుడు. అప్పుడు నిన్ను బంగారంతో అలంకరించటం కాదు, ఆత్మసుఖంతో నిన్ను అలంకరిస్తాడు. మీరు ఇంట్లో బంగారం పెంచుకోవటం కోసం కృషి చేసుకోవచ్చు కనీసం అందులో వందోవంతు అయినా మీ మనస్సును బంగారం చేసుకోవటానికి కృషి చేస్తున్నారా? లేదు. ఇంట్లో బంగారం ఉంటే మోక్షం రాదు, మనస్సు బంగారం అయితే మోక్షం వస్తుంది.

ఈ అజ్ఞానం పోవాలి, ఈ మూర్ఖత్వం పోవాలి అని అనుకొంటే అవిపోవు. అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. అద్దం మురికిగా ఉంది అనుకోండి అందులో మన మొఖం సరిగా కనబడదు. ఆ మురికిని, దుమ్మును శుభ్రంగా దులిపేసాము అనుకోండి అప్పుడు మన మొఖం స్పష్టంగా కనిపిస్తుంది, అలాగే నీవు ప్రయత్నం చేసి నీలో ఉన్న మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకొంటే నీ హృదయంలో ఉన్న పరమాత్మ నీకు గోచరిస్తాడు. మనం ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి, గురువు చూస్తూ ఉంటాడు. ఎప్పుడో టైము చూసుకొని కొన్ని క్షణాలలో నిన్ను అజ్ఞానంలో నుండి విడుదల చేస్తాడు, అది గురవు యొక్క దయ, అది మాటలతో చెపితే నీకు తెలియదు, మీ అనుభవంలోనికి వచ్చినప్పుడు అది తెలుస్తుంది. మంచివాడు కూడా ఒకోసారి చెడ్డపని చెయ్యవచ్చు వాడిలో ఉన్న వాసన చెడ్డ పని చేయిస్తుంది. అంతమాత్రంచేత వాడు చెడ్డవాడు కాదు. మంచివాడికి

చెడ్డవాడికి తేడా ఏమిటి అంటే మంచివాడు ఈ పొరపాటు మాట ఎందుకు ఇలా అన్నాను, ఎందుకు ఈ చెడ్డపని చేసాను అని వెంటనే సర్దుకొంటాడు, చెడ్డవాడు పొరపాటును ఇంక సర్దుకోడు. మనసులో మంచితనం లేకపోతే ఇంక ఆ పొరపాటులో నుండి బయటకురాలేడు. మనకు ఎప్పుడైనా కోరిక వస్తే అది ఒక్కటే నిజం అనిపిస్తుంది, ఎప్పుడైనా ద్వేషం వస్తే అదొకటే నిజం అనిపిస్తుంది, మనకు ఏదైనా తినాలి అనిపిస్తే అదొకటే నిజం అనిపిస్తుంది, దొంగతనంగా తినేస్తాము. మనకు ఏ తలంపు వస్తే తాత్కాలికంగా అదొకటే నిజం అనిపిస్తుంది.

భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా ఫళనిస్వామి ఉండేవారు. ఆయన చాలా వైరాగ్య పురుషుడు. స్త్రీలు అంటే ఆయనకు ఇష్టం ఉండేదికాదు, భగవాన్ దగ్గర వాళ్ళమ్మ కూర్చొన్నా ఇష్టం ఉండేదికాదు. భగవాన్ స్కందాశ్రమంకు వెళ్ళినప్పుడు నువ్వు వంట పెట్టేసావు, నువ్వు సంసారివి అయిపోయావు, నీకూడా రాను అని భగవాన్‌తో చెప్పారు. నువ్వు నాకు ఎంత సేవ చేసావో నాకు తెలుసు. నువ్వు నన్ను మర్చిపోయినా, నేను నిన్ను మర్చిపోను అన్నారు భగవాన్. ఆయన దేవుడు. భగవాన్ విరూపాక్షగుహకు వచ్చి ఫళనిస్వామిని పలకరించి వెళ్ళేవారు. మనకు ఎవరైనా మంచి చెయ్యవచ్చు, చెడ్డ చెయ్యవచ్చు. వారు చేసిన మంచే మనం జ్ఞాపకం పెట్టుకొందాము అనేవారు భగవాన్. ఫళని ఇంకా నాలుగు రోజులకు చనిపోతాడు అనగా ఎవరో మామిడిపండు తెచ్చి ఇచ్చారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నాడు, అంత వైరాగ్యమూర్తికి ఆ మామిడిపండు తినాలనిపించింది, ఇదే మాయ. ఆ కాయను శుభ్రంగా కడిగి ముచ్చిక తీసుకొని ఇంక తినాలనుకొంటున్నాడు, అంతలో భగవాన్ రావటం చూసాడు, ఆ మామిడిపండును దాచేసాడు. భగవాన్ వచ్చి కూర్చొని ఏమిటి ఫళని ఆరోగ్యం ఎలా ఉంది, జ్వరం ఇంకా తగ్గలేదా అని అడిగారు. తరువాత ఫళని ఏమిటి మామిడిపండు వాసన వస్తోంది అన్నారు. మామిడిపండు లేదు, ఏమీ లేదు అని చెప్పాడు. భగవాన్ ఉద్దేశ్యం ఏమిటి అంటే నేను వెళ్ళిపోతే ఆ మామిడిపండు తినేస్తాడు, జ్వరం పెరిగిపోతుంది. ఆ మామిడిపండు ఎక్కడ ఉందో భగవాన్‌కు తెలుసు. భగవాన్ అటు ఇటు తిరిగి వెతికి ఆ మామిడిపండు తీసి శుభ్రంగా తినేసి బయట పడేసి వెళ్ళిపోయాడు. ఇంతకీ ఆ అబద్ధం పదికోట్లు సంపాదించటానికా? కాదు, ఆ మామిడిపండు తినటానికి. మామిడిపండు తినాలనే కోరిక అబద్ధం చెప్పించింది. ఇదే మాయ. ఫళని అబద్ధం చెప్పాడని ఆయన తక్కువవాడు అని అనుకోవద్దు, మనకంటే కోటిరెట్లు గొప్పవాడు. అందుకే పరమాత్మ చెప్పాడు నాదయ లేకుండా, నా పాదాలను ఆశ్రయించకుండా ఎవరూ నా మాయలో నుండి బయటకు రాలేరు అని చెప్పాడు. మాయ చేతిలో మనం ఉంటాము. భగవంతుడి

చేతిలో మాయ ఉంది. అందుచేత ఆయనను ఆశ్రయించటం వలన మాయ దారి ఇస్తుంది. మన ప్రేమగాని, భక్తిగాని, ఆప్యాయతగాని బయట కనిపించనక్కరలేదు. మురుగనార్ భగవాన్ భక్తుడు. భగవాన్ హాలులో కూర్చొన్నప్పడు మురుగనార్ ఎక్కడో దూరంగా, బాగా వెనకాల కూర్చొనేవాడు. భగవాన్ ఏదైనా పని ఉండి పిలిస్తే దగ్గరకు వెళ్ళేవాడు లేకపోతే వెనకాల కూర్చొనేవాడు. మురుగనార్‌కు భగవాన్ అంటే చాలా ఇష్టం, భగవాన్‌కు కూడా మురుగనార్ అంటే ఇష్టం కాని అవసరమైతే మాట్లాడుకొనేవారు, బాహ్యంగా చూస్తే ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నట్లు మనకు తెలియదు, లోపలకు వెళ్ళి చూస్తే వారిది విడదీయలేని ప్రేమ. మురుగనార్‌కు గురువుపట్ల ఎటువంటి భక్తి ఉందో, ఎటువంటి ప్రేమ ఉందో, ఎటువంటి విశ్వాసం ఉందో మనం కూడా గురువు పట్ల అటువంటి భక్తిని, విశ్వాసాన్ని, ప్రేమను అలవర్చుకోవాలి. బాహ్యానికి ప్రదర్శన కోసం ఏమీ నటించనక్కరలేదు. స్నేహం అనేది నటించేది కాదు, అది ఒకరకమైన మాధుర్యం. నీ మనస్సు ఎవరితో శృతి కలుపుతోందో, ఎవరిని స్మరించటం వలన నీ మనస్సు అణుగుతోందో, ఎవరి సాన్నిహిత్యం వలన నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తోందో వాడే నీ గురువు. మనం గురువును ఎన్నుకోవటం వేరు, గురువు మనలను ఎన్నుకోవటం వేరు. మనం గురువును ఎన్నుకొంటే జారిపోవచ్చు, గురువు మనలను ఎన్నుకొంటే జారిపోయే ప్రమాదం లేదు. అది పులినోట్లో పడ్డ మాంసపు ముక్క. తాను ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని అనుగ్రహించే వరకు నీవు ఏ జన్మలో ఉన్నా నిన్ను గురువు విడిచిపెట్టడు.

సమాజంలో సహనం తగ్గిపోయింది. మన ఇంట్లో, సమాజంలో ఎక్కడ చూసినా పేచీలు, అసలు సహనం కనబడటం లేదు. మీ అత్తగారు మిమ్మల్ని నాలుగు తిట్టింది అనుకోండి, మీరు పుట్టింటికి వెళ్ళి చెపుతారు. నీవు కూడా తిరిగి నాలుగు మాటలు అనవలసింది అని తల్లి చెపుతుంది. ప్రస్తుతం మన పరిస్థితి ఇలా ఉంది. అత్తగారు నాలుగు మాటలు అంది, ఏదో పెద్దావిడ అంది, ఓర్చుకొంటే సరిపోతుంది అని తల్లి చెప్పాలి, అలా చెప్పటం లేదు. మనం ఎవరి ఇంటికి వెళ్ళి చూసినా నాలుగు కాసుల బంగారం ఉంటుంది కాని ఎవరి ఇంటిలోను సహనం కనబడటం లేదు. ఎప్పుడైతే సహనం తగ్గిపోయిందో సబ్జెక్టును అర్థం చేసుకొనే శక్తి తగ్గిపోతుంది. మనం మాట్లాడేటప్పుడు, స్నేహాలు చేసేటప్పుడు, వ్యవహారంలో, మన ప్రవర్తనలో వివేకాన్ని విడిచిపెట్టకూడదు. శాంతి అనేది, జ్ఞానం అనేది బజారులో ఎక్కడ లేదు, అది లోపల నుండి రావాలి. నీ హృదయం యొక్క లోతులు పెంచుకొంటూ ఉంటే, నీవు హృదయాభి ముఖంగా లోపలకు ప్రయాణం చేస్తూ ఉంటే ఆ వైభవం అంతా లోపల నుండే వస్తుంది. నీవు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో అది

బయట లేదు, నీ లోపలే ఉంది. బాహ్య గొడవలు జ్ఞానాన్ని తెచ్చిపెట్టవు, ఉపద్రవాలను తెచ్చిపెడతాయి, చివరకు ఏదో రోజున అవి మనలను ముంచేస్తాయి. అందరిలోను నీ గురువునే చూడటానికి ప్రయత్నం చెయ్యి. నిజం ఎలా ఉంటుందో మనకు తెలియదు కాని గురువుకు తెలుసు. నిజం దగ్గరకు మనలను తీసుకొని వెళ్ళే వరకు వేటగాడు జంతువులను ఎలా వెంటాడుతాడో అలాగ గురువు మనలను వెంటాడుతూ ఉంటాడు. భగవంతుడికి గురువుకు ఒక తేడా చెప్తారు. భగవంతుడు మామిడిపండు అయితే అందులో ఉన్న రసం గురువు. మామిడి పండులో తొక్క, టెంక, పీచు, రసం అన్నీ ఉంటాయి. గురువు అంటే టెంక కాదు, తొక్క కాదు, కేవలం రస స్వరూపుడే గురువు. భగవంతుడు కర్మఫలదాత. నీవు చేసిన మంచికి మంచి, చెడ్డకు చెడ్డ ఫలితాన్ని ఇస్తాడు. గురువు అలా కాదు. నీ ముక్కు వంకరగా ఉంటే వంకరగా ఉందని చెప్పడు, నీతో చెప్పకుండా ఆ వంకరను తీసేస్తాడు. నీ మనస్సు బాహ్యముఖానికి పోతోంది అనుకో ఏ కారణాల వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో నీకు చూపించి ఆ కారణాలను తొలగిస్తాడు, వాడు గురువు. నీలో ఆ దోషం ఉంది, ఈ దోషం ఉంది అని గురువు చెప్పడు. ఆయనకు మాటలతో పని లేదు. నీకు తెలియకుండానే ఆ దోషాలను తొలగిస్తాడు. మీరు అలా ఉన్నారు, ఇలా ఉన్నారు అని చెప్పడు. అలా ఉండమని, ఇలా ఉండమని చెప్పడు. మీరు ఏదిగా ఉన్నారో ఆ స్థితిలోనికి మిమ్మల్ని గెంటుకొని పోతాడు. వాడు గురువు. గురువు దగ్గర నుండి వచ్చే సహాయ సహకారములు అర్థం చేసుకొనే బుద్ధిసూక్ష్మత మనకు లేదు. గురువు ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని మనం పొందాక గురువు చేసిన సహాయం, గురువు యొక్క దయ ఏమిటో మనకు అర్థం అవుతాయి కాని అప్పటివరకు మనం ప్రయత్నం చేసినా అర్థం కాదు. గురువు జడ్జిమెంట్లు చెప్పడు. నీ మనస్సును సంస్కరించి ఆత్మాకారం చెందేటట్లు చేస్తాడు, వాడు గురువు. గురువు మనకు సహాయం ఎలా చేస్తాడు, ఎప్పుడు చేస్తాడు అనేది ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. మనం సహనంగా ఉంటే సరిపోతుంది. హృదయశుద్ధి కలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు అని ఏసుక్రీస్తు చెప్పాడు. హృదయంలో ఉన్న సత్యం మీకు గోచరించే వరకూ మీకు శాంతి లేదు, సుఖం లేదు. హృదయంలో ఉన్న శాంతి స్థానాన్ని మనం చేరుకోవాలి. హృదయశుద్ధి ఉన్నవారు మాత్రమే అక్కడకు చేరుకోగలరు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-03-2007, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నిప్పుకు వేడి అనేది గుణం కాదు, అది సహజం అలాగే సహనం అనేది ఒక గుణం